క్లుప్తంగా

కలెక్టరుకు వెల్లటూరు బాధితుల వినతి

బొల్లాపల్లి: ఇటీవల బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామంలో ఆక్రమణల పేరుతో కోర్టుదేశాలు ఉన్నాయంటూ నివాస గృహాలు కూల్చివేసిన ఘటనలో బాధితులు సోమవారం నరసరావుపేట కలెక్టర్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కంభపాటి దాసు, గంగనబోయిన మునెయ్య, నాగరాజు, చెంచినీటి గౌరమ్మ, కంచర్ల గోవిందమ్మ, చొప్పవరపు చిన్నమునెయ్య, నారాయణమ్మలతోపాటు మరికొంతమంది గ్రామస్తులు కలెక్టరును కలసి వాపోయారు. గత కొన్నేళ్లుగా నివాస గృహాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామని అయితే గ్రామానికి చెందిన ద్రోణాదుల మల్లికార్జున అనే వ్యక్తి తన వ్యవసాయ భూమికి అడ్డుగా ఇళ్లున్నాయని వాటిని తొలగించాలని కోర్టును ఆశ్రయించాడు. కనీసం ఇళ్లు సర్దుకునే సమయం కూడా ఇవ్వకుండా ఇళ్లను ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ పోలీసుల అధికారులు కూల్చి వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాకు సత్వర న్యాయం చేయాలని కోరారు. మాకు నష్ట పరిహారంతోపాటు ఇళ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా కాసు బ్రహ్మానందరెడ్డి జయంతి వేడుకలు



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా, గవర్నర్‌గా దేశానికి కాసు బ్రహ్మానంద రెడ్డి విశేష సేవలు అందించారని కాసు బ్రహ్మానంద రెడ్డి విద్యాసంస్థల ప్రిన్సిపల్ సి.హెచ్.వి. నాగిరెడ్డి తెలిపారు. కళాశాలలో సోమవారం బ్రహ్మానంద రెడ్డి 116వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మానంద రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.వెంకట శివ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోండి

నరసరావుపేట: స్థానిక ఏపీఎస్‌ఆర్టీసీ డిపోలో ఆన్‌కాల్ డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ బూదాటి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎనిమిదవ తరగతి చదివి హెవీ వెహికల్ లైసెన్సు కలిగి ఏడాది గడిచి ఉండాలన్నారు. సంస్థ నిబంధన ప్రకారం డ్రైవింగ్ చేసిన యెడల వారికి ప్రతి దినము రూ.800లు జీతం ఇవ్వబడుతుందన్నారు. అర్హతలు ఉన్న వారు 9959225428 ఫోన్ నంబరుకు ఫోను చేసి వివరాలు తెలుసుకుని హాజరు కావాలని కోరారు.

ప్రగతి కోసం పనిచేయాలి

యడ్లపాడు: అధిపత్య ధోరణులు, పంతాలు వదిలేసి పల్లెల ప్రగతికే నాయకులు ప్రాధాన్యం ఇవ్వాలని చిలకలూరిపేట శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. మండలంలోని మైదవోలు, కొండవీడు, కొత్తపాలెం గ్రామాల్లో సుపరిపాలనలో భాగంగా ఆయన పార్టీ శ్రేణులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



నాదెండ్ల: అమీన్‌సాహెబ్‌పాలెం పాలకేంద్రం వద్ద సోమవారం నరసరావుపేట ఎంపీ రెడ్డి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎంపీ రెడ్డి పాల్గొని 55 మందికి కంటి పరీక్షలు చేశారు. 22 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించి ఆసుపత్రికి రిఫర్ చేశారు. కంటిలోపాలున్న వారికి కళ్ళజోళ్లు సిఫార్సు చేశారు. త్వరలో వీరికి సబ్సిడీపై కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. వైద్యసేవ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్లుతెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు గుర్రం నాగపూర్ణచంద్రరావు, పూనాటి కోటేశ్వరరావు, గుర్రం రామారావు, పీఆర్‌వో దిలీప్ ఉన్నారు.

నివేశన స్థలాల సమస్యపై తహసీల్దార్‌కు వినతి

యడ్లపాడు: గతంలో మంజూరైన స్థలాల్ని పొజిషన్ చూపలేదు... కొత్తగా ఇచ్చే వాటికి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లేదంటూ మహిళలు రెవెన్యూ అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో యడ్లపాడు గ్రామానికి చెందిన పలుకుటుంబాలకు చెందిన మహిళలు తహసీల్దార్ జెట్టి విజయశ్రీని కలిశారు. గ్రామ పరిధిలో గత ప్రభుత్వం తమకు నివేశన స్థలాలు మంజూరు చేశారని, అయితే వివిధ కారణాలతో వాటిని అప్పట్లో అధికారులు పొజిషన్ చూపలేదన్నారు. తాజాగా నివేశన స్థలాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు తమకు అవకాశం లేదని, సదరు ఆన్‌లైన్‌లో నమోదైన తమపేర్లను తొలగిస్తే, కొత్తగా తాము దరఖాస్తు చేసుకుంటామని వేడుకున్నారు. ఆయా విషయాలతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. వినతి ఇచ్చిన వారిలో బి.అంజలి, ఎల్.మేరీ కుమారి, కె మాధవి, జి.మేరి, ఎం.శిరీష, కె. పల్లవి, దావల ప్రసన్న, కె.లక్ష్మీ, కొండమ్మ, శివకుమారి, కామినేని సుబ్బాయమ్మ తదితరులు ఉన్నారు.

అమ్మో... పడమర వాగు!

- వర్షం కురిస్తే రెండు గ్రామాలకు కునుకు పట్టదు
- సొలస, లింగారావుపాలెం పంట పొలాలకు దెబ్బ
- సొలస సంగనోళ్ల బజారు, లింగారావు పాలెం బీసీ కాలనీలకు వరదముంపు



లింగారావుపాలెం శివాలయం వద్ద పడమర వాగు దుస్థితి

యడ్లపాడు: పడమరవాగు.. కొన్ని గ్రామాల్లోని పంటపొలాల్లో కురిసిన నీరంతా కలిసి ప్రవాహమై దిగువకు వెళ్లేందుకు దోహదపడే నీటి పరీవాహక ప్రదేశం. ఎండకాలమంతా చిన్న మురుగునీటి కాలువలా కనిపిస్తుంది. కానీ, ఓ మోస్తారు వర్షం కురిస్తేచాలు వాగు వెల్లువై బుడమేరులా పొంగి పొర్లడం ఖాయం. ప్రతియేటా వర్షాకాలంలో సొలస, లింగారావుపాలెం గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. సొలసలో పిల్లిడొంకగా, లింగారావుపాలెంలో పడమరవాగుగా పేరొందిన ఈ వరదనీటి పరీవాహక ప్రాంతం దశాబ్దాలుగా ఇరు గ్రామాల రైతుల్ని, ప్రజల్ని కలవర పెడుతోంది.

వరద నీరు ప్రవహిస్తోందిలా...

నాదెండ్ల మండలంలోని జంగాలపల్లి, సంక్రాంతిపాడు పరిధిలోని పంటపొలాల మీదుగా వచ్చే వర్షపు నీరు ముందుగా సొలస గ్రామంలోని సంగనబజారు గుండా తాగునీటి చెరువు పక్కగా వెళ్తుంది. అక్కడి నుంచి సొలస పంటపొలాల్లోని నీరు కలవడంతో చెరువు వద్ద నుంచి రెండు పాయలుగా చీలి ఒకపాయ దక్షిణ దిశగా ఉన్న నక్కవాగులోకి కలుస్తుంది. మరోపాయ పడమరవైపుగా లింగారావుపాలెం హిందూ శ్మశానం పక్కగా బీటీపైకి ఎక్కుతుంది. అదే సమయంలో చిరుమామిళ్ల గ్రామ పొలాల్లోని నీరంతా చాకలికుంట వద్దకు చేరి వరదగా మారి లింగారావుపాలెంలోని శివాలయం ఎదురుగా పడమరవాగులో వచ్చి కలుస్తుంది. దీంతో వాగు ఉగ్రరూపం దాల్చి శివాలయం పక్కగా ఊరి మధ్యగా పెదనందిపాడు మేజర్ కాలువ కట్ట వెంబడిగా ఊరి ప్రారంభంలో ఉన్న అక్విడెక్టు వద్ద నక్కవాగులో కలుస్తుంది.

అటు రైతులు ఇటు స్థానికులు..

వరద నీరు వచ్చిందంటే సొలస గ్రామంలోని సంగనబజారు, లింగారావు పాలెంలోని బీసీ కాలనీలు



సొలస గ్రామంలో పిల్లిడొంకగా పిలిచే పడమర వాగు పరిస్థితి

వరద నీటిలో నిలిచి రాత్రంతా జాగారం చేయాల్సి వస్తుంది. సొలసలో గతంలో వచ్చిన వరదల్లో రెండు పర్యాయాలు భారీ కొండచిలువలు కొట్టుకురాగా గ్రామస్తులు భయభ్రాంతులకు గురై అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు వాటిని తీసుకెళ్లి అటవీప్రాంతాల్లో వదిలిన సంఘటనలు జరిగాయి. అలాగే లింగారావుపాలెంలో కల్వర్టులు, కాలనీలు, రహదారులు, పంటపొలాలను పడమరవాగు నీరు చుట్టుముడుతుంది.

నీరు ముందుకు పోకనే ముప్పు!

మొదట ఎంతటి వర్షాలు కురిసినా నీరు ఎక్కడా ఆగకుండా నేరుగా వెళ్లడంతో పంటలకు ఎలాంటి ఇబ్బంది ఉండేదికాదు. కానీ విశాలమైన ఈ పరీవాహక ప్రాంతం చాలాచోట్ల ఆక్రమణకు గురికావడంతో 20 అడుగులకు పైగా ఉండే ఈ వాగు ప్రస్తుతం 3,5 అడుగులకు కుచించుకు పోయింది. దిగువ ప్రాంతాల్లో ఎక్కువ శాతం ఆక్రమణ చేయడంతో నీరు వెనుక్కు నెట్టి వేయడంతో వెల్లువై ఊరిపై పడి ఇళ్ల మధ్య నిలిచి ఇక్కట్ల పాలుచేస్తుంది. ఇదిలా ఉంటే సుమారు 5 కిమీ పొడవైన ఈ వరద పరీవాహక ప్రదేశంలో పలు మలుపులు, జమ్ము, పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు అల్లుకుని వరద ప్రవాహాన్ని ముందుకు కదలనీయడం లేదు.

దీంతో ఇరుగ్రామాల్లోని 250 ఎకరాల పంటపొలాలపై విరుచుపడుతోంది. దీనికారణంగానూ అటు పంటలకు, ఇటు నివాసితులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యపై పాలకులు, అధికారులు పడమర వాగుకు జంగిల్ క్లియరెన్స్, పూడికతీత, రిటైనింగ్ గోడల నిర్మాణం వంటి పనులు చేపట్టి, శాశ్వత పరిష్కారం చేయాలని ఇరుగ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అంత్యక్రియల నిర్వహణా కష్టమే

ప్రధానంగా అక్విడెక్టు సమీపంలోనూ, అలాగే శివాలయం ఎదుట మలుపు వద్ద రోడ్లపై భారీగా నీటి ప్రవాహం ఏర్పడి రాకపోకలు నిలిచి ఊరితో సంబంధాలు తెగిపోతాయి. బీటీ రోడ్లు సైతం వరద ధాటికి బీటలువారుతోంది. మరోవైపు వర్షాల సమయంలో ఎవరైన కాలం చేస్తే పాడెతో శ్మశానంలోకి వెళ్లే పరిస్థితి లేక పడమరవాగులో పడిన, వాగు ప్రవాహం తగ్గేవరకు అంత్యక్రియలు వాయిదా వేసుకున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాన పడితే భారీ పంటనష్టం



వానపడితే బుడమేరులా పిల్లిడొంక వరద నీటితో పరవళ్లు తొక్కుతుంది. జనవాసాల్లోనూ, పంటపొలాల్లోనూ నీటితో ముంచెత్తుతుంది. చెరువు పక్కగా సొలస పరిధిలోని దక్షిణ, పడమర వైపున్న 150 ఎకరాల వెల్లువకు పంట పొలాలు మునిగిపోతాయి. సంగన వీధుల్లోనూ జలమయం అవుతుంది.

–మద్దూరి విజయబాలచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ, సొలస

దశాబ్దాలుగా నరకమే



పడమరవాగుతో బీసీకాలనీని వరద ముంచుతుంది. వాగు నిండుగా ప్రవహించి శ్మశానంలోకి వెళ్లేమార్గం ఉండదు. అలాగే మసీదు ప్రాంతమంతా నీరునిలిచి అడుగు వేయలేం. అన్నింటికీ మించి ఊళ్లోకి వచ్చే రెండు దారుల్లోనూ రోడ్లపై వరద నీరుండి రాకపోకలు బంద్ అవుతాయి. ఇలా దశాబ్దాలుగా నరకం చూస్తున్నాం.

–ఆలోకం వెంకట లక్ష్మీనారాయణ, లింగారావుపాలెం

అనుబంధ విభాగాల కమిటీల ఏర్పాటుకు కృషి



అనుబంధ విభాగాల అధ్యక్షుల జాబితాను మాజీ మంత్రి విడదల రజినికి అందజేస్తున్న మస్తాన్‌వలి

చిలకలూరిపేట: పార్టీ అనుబంధ విభాగాల కమిటీ ఏర్పాటుకు కృషి చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ అనుబంధ విభాగాల ఇన్‌చార్జి షేక్ మస్తాన్‌వలి, పట్టణంలోని మాజీ మంత్రి నివాసంలో ఆమెను సోమవారం కలిసారు. నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను మాత్రమే ఇప్పటికి నియమించడం జరిగిందని, అనుబంధ విభాగాల కమిటీలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని మస్తాన్‌వలి కోరారు. ఈ విషయమై మాజీ మంత్రి విడదల రజిని మాట్లాడుతూ పూర్తి స్థాయిలో కమిటీల ఏర్పాటుకు దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ కమిటీల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. ఇప్పటికే అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం పూర్తి అయిన నేపథ్యంలో మిగిలిన పదవులకు పేర్లను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొత్త కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, భవిష్యత్తులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని వివరించారు.

కూటమి పాలనపై తీవ్ర వ్యతిరేకత



బుక్కాపురంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ దరియావలి చెప్పారు. పట్టణంలోని 17,25,29 వార్డుల్లో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ క్యూ ఆర్ కోడ్ స్కాన్ ప్రజలతో చేయించారు. ఈ సందర్భంగా దరియావలి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన వాగ్దానాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిందేమి లేదని అయినప్పటికీ సుపరిపాలన పేరుతో ఇళ్లకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు పరిచారని గుర్తు చేశారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి అమలు చేశారని వెల్లడించారు. ఇందుకు విరుద్ధంగా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను నట్టేటా ముంచిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బండారు జయకుమార్, గోపతోటి జాన్, సాపా సైదావలి, డీలర్ సుభాని, ఊసా రమేష్, మోషే, రవి, నిరంజన్, ఇర్రి రాఘవ, నారాయణ,శివ, అమర్, కౌన్సిలర్ షేక్ యూసుఫ్‌అలి, జి వాసు, శివ మణి దరియావలి, మద్దిరాల మౌలాలి, కరిముల్లా, బాజి, షేక్ నజీర్, మౌలా తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల మండలంలో...

నాదెండ్ల: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదనీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో ప్రజల్ని మోసగించారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దూరి కోటిరెడ్డి చెప్పారు. బుక్కాపురం, తూబాడు శివారు రాజుగారిపాలెం, కనపర్రు గ్రామాల్లో ఆదివారం రాత్రి బాబు ష్యూరిటీ



చిలకలూరిపేట ప్రజలతో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయిస్తున్న దరియావలి

– మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల్ని మోసగించిన విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పథకంలో కోతలు విధిస్తూ అన్ని వర్గాల ప్రజలను ప్రభుత్వం వంచించిందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలకు కల్పించకపోవటంతో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఎందరో రైతులు ఆత్మహత్యలు సైతం చేసుకున్నారని, వీటికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం మొదటి ఏడాది ఎగ్గొట్టారని, ఈ ఏడాది ఖరీఫ్‌ప్రారంభమైనా నేటి వరకూ అమలు చేయలేదని, దీంతో రైతులు వ్యవసాయంపై ఆసక్తి కోల్పోతు న్నారన్నారు. తల్లికి వందనం పథకం అర్హులందరికీ అమలు కాలేదన్నారు. జగనంటే నమ్మకం, బాబంటే మోసం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షుడు మంగు ఏడుకొండలు, జిల్లా అధికార ప్రతినిధి ఉడతా వెంకటేశ్వరరావు, యువజన విభాగం అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభుదాస్‌నాయుడు, బీసీ సెల్ అధ్యక్షుడు గుంజి శ్రీనివాసరావు, తూబాడు, కనపర్రు గ్రామాల పార్టీ అధ్యక్షులు చట్టాల నాగరాజు, పచ్చవ వెంకటేశ్వర్లు, మండల కోఆప్షన్ సభ్యుడు మూసా, జానీబాషా, పలు విభాగాల నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

నాదెండ్ల: మండలంలోని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోటరీక్లబ్ ఆఫ్ పండరీపురం ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం అందించారు. వైద్యాధికారి కవితా అనసూయదేవి, క్లబ్ అధ్యక్షుడు బోనం వెంకటేశ్వరరావు పౌష్టికాహారం కిట్లు అందించారు. బాలింతలు, గర్భిణులు ప్రతినెలా వైద్య పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మనోజ్ కుమార్, కోశాధికారి శ్రీనివాసరావు, సభ్యులు రఘు రామిరెడ్డి, అనిల్ కుమార్, మోహన్, దాసునాయన, ఆదిరెడ్డి, రాఘవయ్య, పుల్లయ్య ఉన్నారు.

ప్లాట్లు క్రమబద్ధీకరించుకోండి

నరసరావుపేట: ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ఈ ఏడాది జూన్30వ తేదీ వరకు రిజిష్టర్ అయిన అనుమతిలేని లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు వాటి యజమానులు అపరాధ రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఈనెల 26వ తేదీన జీవో జారీ చేసిందన్నారు. క్రమబద్ధీకరించుకోకపోతే భవన నిర్మాణ అనుమతులు, మౌలిక వసతులైన రోడ్లు, డ్రైయినేజ్, నీటిపంపు కనెక్షన్లు, వీధి దీపాల ఏర్పాటు జరగదని తెలిపారు.

ట్రైనీ ఎస్సైగా నరేష్‌కుమార్

నూజెండ్ల: ఐనవోలు పోలీస్ స్టేషన్ ట్రైనీ ఎస్సైగా పి.నరేష్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ నెల 23 న 53 మంది ఎస్సైలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వారిలో 13 మందిని పల్నాడు జిల్లాకు కేటాయించటం జరిగిందని ఎస్సై బి.వి.కృష్ణారావు తెలపారు. ఇందులో భాగంగా నూజెండ్ల మండలం ఐనవోలు పోలీస్ స్టేషన్‌కు నరేష్‌కుమార్‌ను నియామకం చేశారని ఆయన తెలిపారు.

త్వరలో కెనాల్‌కు సాగునీరు

శావల్యాపురం: జలాశయాలన్నీ నిండు కుండలా తలపిస్తున్నాయని లింగంగుంట్ల ఎన్నెస్పీ డీఈ జరుగుల విజయలక్ష్మి సోమవారం అన్నారు. డీఈ మాట్లాడుతూ సాగర్ జలాశయం నుంచి 5 వేల క్యూసెక్కుల సాగర్ జలాలను మాచర్ల పరిధిలో ఉన్న బొగ్గువాగుకు నింపుతున్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజనుకు సాగు నీరు కొరత లేదని రోజుల వ్యవధిలో గంటావారిపాలెం గ్రామ సమీపాన ఉన్న నటువంటి అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు సాగునీరు విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మాగాణి మెట్ట పంటలు రైతులు సాగు చేసుకోవచ్చునన్నారు.

విత్తన కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలి

శావల్యాపురం: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో పలు జాగ్రత్తలు పాటించాలని లేని పక్షంలో నష్టపోయే ప్రమాదం ఉందని ఏడీఏ సీహెచ్ రవికుమార్ వెల్లడించారు. సోమవారం స్థానిక రైతుసేవా కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కంపెనీ పేరు లేని విత్తనాలు, లూజుగా కేజీల చొప్పున విక్రయిస్తున్నా విత్తనాలను కొనుగోలు చేసి మోసపోవద్దని, గడువు దాటిన విత్తనాలు, చినిగిన ప్యాకెట్లు మార్కెట్ ధర కంటే తక్కువ ధరకే విక్రయిస్తామని చెప్పే విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు.

బాధ్యతలు చేపట్టిన చిలకలూరిపేట ఎంఈవో

చిలకలూరిపేట: మండల విద్యాశాఖాధికారిగా బి.సత్యనారాయణసింగ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నరసరావుపేటలోని శ్రీరామకృష్ణ ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన పదోన్నతిపై ఎంఈవోగా ఇక్కడికి వచ్చారు. ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం బొప్పూడి గ్రామంలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.

వందశాతం ఉత్తీర్ణతకు చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు తెలిపారు. లింగంగుంట్ల శంకర భారతీపురం జెడ్పీ హైస్కూల్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఉపాధ్యాయులతో సమావేశమై గత సంవత్సరం పది పరీక్షల ఫలితాలపై సమీక్షించారు. ఈ ఏడాది విద్యార్థుల ఏ విధంగా చదువుతున్నారు.. అడిగి తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా తక్కువ మార్కులు వచ్చిన విద్యార్థుల వివరాలను తెలుసుకొని సంబంధిత ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం ఆరవ తరగతి సీ, ఈ సెక్షన్‌లకు వెళ్లి విద్యార్థుల తెలుగు, ఆంగ్లం, హిందీ సామర్థ్యాలను పరీక్షించారు. జిల్లా కలెక్టర్ టీచర్‌గా మారి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. చదవడం, రాయడంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. కొద్దిరోజుల్లో పాఠశాలను మరోసారి సందర్శిస్తారని అప్పటికీ విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో చంద్రకళ, ఉప విద్యాశాఖ అధికారి సుభాని, ఎంఈవో ఎస్.నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయురాలు పి.పార్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహజ వనరులను పరిరక్షించండి



జెఎంజెలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

జేఎంజే కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరి

తెనాలిఅర్బన్: సహజవనరులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని జేఎంజే కళాశాల గణితశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎస్.ఉమామహేశ్వరి పేర్కొన్నారు. ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని జేఎంజే కళాశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవంతుడు మనకు ఇచ్చిన వరం ప్రకృతి అని తెలిపారు. ప్రకృతిని కాపాడితే పర్యావరణాన్ని పరిరక్షించిన వారమవుతామని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రూజ్‌లీన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ప్రకృతి పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని చెంచుపేటలోని కోగంటి శివయ్య మున్సిపల్ హైస్కూల్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు కప్పల రాజారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన వాతావరణం ఉంటే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. సహజ వనరుల్లో గాలి, నీరు, నేల, మొక్కలు, వన్యప్రాణులు, ఖనిజాలు ఉంటాయని తెలిపారు. వాటిని పరిరక్షించడం ద్వారా భావితరాలకు మేలు చేసిన వారమవుతామని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, 22వ ఆంధ్ర బెటాలియన్ కమాండిగ్ ఆఫీసర్ కల్నల్ ఆకుల ఉదయ్‌కుమార్, సుబేదార్ సేవాదేవ్, హవాల్దార్ అజయ్, అంబారీషుడు, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ జయప్రదం చేయండి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు
- విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి పిలుపు
- గోడ ప్రతులు ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నరసరావుపేట: ఎప్పటికైనా రెగ్యులర్ చేయకపోతారా అని విద్యుత్ కార్మికులు రెండు దశాబ్దాలుగా సంస్థనే నమ్ముకొని చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని, వారి వేతనాలు పెంచాలని ఏపీ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు జల్లెడ రాజశేఖర్ పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కమిటి పిలుపులో భాగంగా వచ్చే నెల ఏడవతేదీన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో నాయకులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో షిఫ్ట్ ఆపరేటర్లు, వాచ్‌మెన్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, బిల్ కలెక్టర్లు, స్టోర్ హమాలీలు, మీటర్ రీడర్లు, ఎస్పీఎం, సిబిడి గ్యాంగ్‌మెన్లుగా కాంట్రాక్ట్ కార్మికులు రకరకాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని, వీరికి పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ఆధ్వర్యంలో అనేక మార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎండీలకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో చలో విజయవాడకు పిలుపునిచ్చామన్నారు.

పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఆంజనేయులు నాయక్, ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్రంలో 23,500 మందికి కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.46 వేలు, 2022 పీఆర్‌సీ, ఎరియర్స్, ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అన్‌స్కిల్డ్ కార్మికులకు, ఐటిఐ విద్యార్హత ఉన్నవారిని స్కిల్డ్‌గా ప్రమోట్‌చేసి పాత ఆపరేటర్‌లతో సమానంగా వేతనం ఇవ్వాలని, వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెయిడ్ హాలిడేస్ ఇవ్వాలని, బిల్ కలెక్షన్ ఏజెంట్లు, ఎస్‌పీఎం కార్మికులు, విద్యుత్ స్టోర్ హమాలీలకు పీస్ రేటు రద్దుచేసి కనీస వేతనాలు చెల్లించాలని, మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.

కార్మికులకు ప్రమాదం జరిగితే నష్టపరిహారం, కోలుకునే వరకు ప్రత్యేక సెలవులు, వైద్య ఖర్చులు ఇవ్వాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని కొత్తగా నిర్మించిన సబ్‌స్టేషన్‌లలో ఖాళీలను భర్తీ చేసి ప్రతి సబ్‌స్టేషన్‌కు నైట్ వాచ్‌మెన్‌లను కేటాయించాలన్నారు. ఏపూరి గోపాలరావు, షేక్. సిలార్ మసూద్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని సైకిలిస్ట్ మృతి

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని సైకిలిస్ట్ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని బొందిలిపాలెంకు చెందిన బీకం శ్రీనివాససింగ్ (60) వృద్ధుడు మండలంలోని పసుమర్రు సమీపంలోని తనకు చెందిన నివేశన స్థలాలను చూసుకుని పట్టణానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. మధ్యాహ్నం సమయంలో గుర్తు తెలియని వాహనం సైకిల్‌ను వెనుక నుంచి ఢీకొని నిలుపుదల చేయకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో వృద్ధుడి సైకిల్ దూరంగా వెళ్లి పడి నుజ్జునుజ్జు కాగా, శ్రీనివాససింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హైవే సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని చిలకలూరిపేట పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య సంభాబాయి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సత్యనారాయణ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన బీకం శ్రీనివాససింగ్

చికిత్సపొందుతూ ఒకరు మృత్యువాత



యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరు మృత్యువాత పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిలకలూరిపేట నుండి గుంటూరు దిశగా ఆదివారం బుల్లెట్ వాహనంపై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్నా రు. ఆదివారం మండలంలోని తిమ్మాపురం కొత్త బైపాస్ వంతెనపై జరిగిన ఈ ప్రమాదంలో మేడికొండూరు మండలం పాలడుగు గ్రామానికి చెందిన దొప్పలపూడి హనుమాకోటి శాస్త్రి, దండా గోపి, మరోక వ్యక్తి ఉన్నారు. తీవ్రగాయాలైన వీరిని గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వారిలో బీటెక్ విద్యను పూర్తి చేసిన దొప్పలపూడి హనుమాకోటిశాస్త్రి(26) మృతి చెందినట్లు వైద్యులు సోమవారం ధృవీకరించారు. కేసు నమోదు చేసుకున్న యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణ మృతదేహాన్ని శవపంచానామ నిర్వహించి కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు.